సాక్షి సిద్దిపేట

ఆదివారం । 16 । జూలై । 2023



ఇసుకాసురుల భోజ్యం 8లో..

అక్కన్నపేట మండలంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. వాగులు, వంకల నుంచి పగలూరాత్రీ అనే తేడా లేకుండా జరుగుతున్న అక్రమ దందాను అడ్డుకునే వారే కరువయ్యారు.



బీటీరోడ్డు నిర్మాణం ఎప్పుడో?

ప్రభుత్వం గ్రామాలను ఆదర్శంగా మార్చడమే లక్ష్యంగా ముందుకెళ్తుంది. కొన్ని తండాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. బీటీ రోడ్డు వేయాలని తండావాసులు ఉన్నతాధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదు. 9లో..

19న సీల్డ్ టెండర్లు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఈనెల 19వ తేదీన ఆలయానికి కూరగాయల సరఫరా, పాలు, పెరుగు సరఫరా, పూలు, పూల దండలు సరఫరా, ఫొటోలు వీడియోలు తీయుటకు సీల్డ్ టెండర్లను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాల కోసం ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

విద్యార్థులకు వసతులు కల్పించాలి

అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

కోహెడరూరల్(హుస్నాబాద్): వసతి గృహాల్లో విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని శనిగరం గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ గదులు, వంటశాలను పరిశీలించి సంక్షేమ అధికారి పోగుల రాజుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని పలు సమస్యలు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. వాటిని నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మహిళలు ఆరోగ్యం ఉండాలి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్

చిన్నకోడూరు(సిద్దిపేట): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం బాగుంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శనివారం చిన్నకోడూరులో రుతుప్రేమపై అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు శానిటరీ ప్యాడ్స్‌కు బదులు పర్యావరణ హితమైన శానిటరీ కప్పులు, క్లాత్ ప్యాడ్స్ ఉపయోగించాలని సూచించారు. వీటి వాడకం వల్ల ఆర్థిక భారం కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఓ దేవకీ దేవి, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత, సీడీపీఓ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఎంపీఓ సోమిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ములుగు ఎఫ్‌సీఆర్‌ఐలో ట్రైనీ బీట్ అధికారులు



ములుగు అటవీ కళాశాలను సందర్శించిన ట్రైనీ బీట్ అధికారులు

ములుగు(గజ్వేల్): తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ ధూలపల్లికి చెందిన ట్రైనీ ఫారెస్ట్ బీట్ అధికారులు శనివారం ములుగు అటవీ కళాశాల, పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. 33వ బ్యాచ్‌కు చెందిన అధికారులకు కళాశాలలో ట్రైనింగ్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాస్త్రానికి సంబంధించిన వివిధ అంశాల గురించి ఎఫ్‌సీఆర్‌ఐ శాస్త్రవేత్తలు వారికి వివరించారు. అనంతరం ఎఫ్‌సీఆర్‌ఐలోని లేబొరేటరీస్, మ్యూజియం, ట్రీ పార్క్, వైల్డ్ ఫ్రూట్ గార్డెన్, వుడ్ ప్రాసెసింగ్ సెంటర్, హనీ బీ కీపింగ్ సెంటర్‌లను ట్రైనీ బృందం సందర్శించింది. కార్యక్రమంలో కళాశాల జాయింట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కపిల్‌సిహాగ్, డాక్టర్ చిరంజీవ, శైలజ, హరీష్ బొజ్జా పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్ విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం

సిద్దిపేటకమాన్: ఆగస్టు 6న నిర్వహించనున్న హాఫ్ మారథాన్ రన్‌లో యువత ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం అన్నారు. హాఫ్ మారథాన్ రన్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం సిద్దిపేట కోర్టులో న్యాయమూర్తి రఘురాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సిద్దిపేటలో భాగంగా రంగనాయక్ సాగర్ ప్రాజెక్ట్ వద్ద ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు భవాని, స్వాతిరెడ్డి, చందన, మిలింద్ కాంబ్లి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, గజ్వేల్, హుస్నాబాద్ ఏసీపీలు రమేష్, సతీష్, దుబ్బాక సీఐ కృష్ణ, సీసీఆర్‌బీ సీఐ గురుస్వామి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటలింగం, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యమస్తు!

- సిద్దిపేటలో నడుస్తూ చెత్త తొలగిద్దాం కార్యక్రమం
- ఆరోగ్య పరిరక్షణకు ఉచితంగా యోగా క్యాంప్‌లు
- పట్టణంలో వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం

సాక్షి, సిద్దిపేట: ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలు ఆనందకరమైన జీవనం సాగిస్తారు. ఇందుకోసం పరిసరాల పరిశుభ్రత పాటించడం, యోగా, వాకింగ్ తదితర వాటిపై దృష్టిసారిస్తే మేలు జరుగుతుంది. ఆ దిశగా ఆలోచించిన ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు సిద్దిపేట ప్రజలు ఆరోగ్యం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. పట్టణంలో నడుస్తూ చెత్తను తొలగిద్దాం కార్యక్రమం, కాలనీలో ఉచిత యోగా క్యాంపులు, సింథటిక్ వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రతీరోజు కోమటి చెరువు నక్లెస్ రోడ్, బాలికల పాఠశాలలోని సింథటిక్ ట్రాక్‌లలో వాకింగ్ చేస్తున్నారు. అలాగే యోగా క్యాంప్‌లలో యోగా చేస్తూ నేర్చుకుంటున్నారు.

ఉచిత యోగా శిబిరాలు

పట్టణంలో ఉచిత యోగా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో కాలనీలో పది రోజుల పాటు ఉచిత క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, అమృతహారం, ఆరోగ్య సూత్రాలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇస్తున్నారు. ఈ శిబిరాలకు వచ్చిన వారికి శిక్షణ అనంతరం ఉచితంగా యోగా మ్యాట్‌లను సైతం అందజేస్తున్నారు. ఇలా ప్రజల ఆరోగ్య రక్షణ కోసం మంత్రి హరీశ్‌రావు కృషి చేస్తున్నారు. అనారోగ్యం బారిన పడి ఆస్పత్రుల బాట పట్టవద్దని, ఆరోగ్య రక్షణ కోసం ప్రజలు అడుగులు వేసే విధంగా చేస్తున్నారు.



ఉచిత యోగా క్యాంప్

వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం

సిద్దిపేట పట్టణంలో వాకింగ్ ట్రాక్‌లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే కోమటి చెరువు సమీపంలోని నక్లెస్ రోడ్‌లో సింథటిక్ వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి వచ్చింది. అలాగే కోమటి చెరువు చుట్టూ ఆహ్లాద వాతావరణంలో వాకింగ్ చేసేవిధంగా సింథటిక్ ట్రాక్ నిర్మాణం చివరి దశలో ఉంది. బాలికల పాఠశాలలో నిర్మించి సింథటిక్ వాకింగ్ ట్రాక్‌ను ప్రజలు వినియోగించుకుంటున్నారు. ఈ ట్రాక్‌లపై పలువురు వాకింగ్ చేస్తూ వారి ఆరోగ్యాన్ని రక్షించుకుంటున్నారు.



వాకింగ్ చేస్తున్న పట్టణ వాసులు

చెత్తను తొలగిస్తూ

సిద్దిపేట మున్సిపాలిటీ అన్నింటా ఆదర్శంగా నిలుస్తోంది. మన ఇంటితోపాటు.. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశంతో పట్టణంలో నడుచుకుంటూ చెత్తను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జూన్ 28న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పటి వరకు 16వార్డుల్లో విజయవంతంగా పూర్తి చేశారు. ఇంటి చుట్టూ పక్కల చెత్త వేయవద్దని ప్రజలను కోరుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొంటూ కాలనీలో రోడ్ల వెంట చెత్తలేకుండా చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు.



కాలనీల్లో నడుస్తూ చెత్తను ఏరివేస్తున్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది

ప్రతి ఒక్కరికీ యోగా నేర్పించాలని



యోగా చేయడం వలన ఆరోగ్యాన్ని రక్షించుకున్నవాళ్లం అవుతాం. సిద్దిపేటలో ప్రతి ఒక్కరికీ యోగా నేర్పించాలని ఉద్దేశంతో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో ఉచిత యోగా క్యాంప్‌లను ఏర్పాటు చేయిస్తున్నారు. ఆనంద యోగా పేరుతో క్యాంప్‌లను నిర్వహిస్తున్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. –తోట సతీష్, రాష్ట్ర యోగాధ్యాయన పరిషత్ సభ్యులు

నడుస్తూ చెత్త ఏరివేత



మంత్రి హరీశ్ రావు సూచనలతో నడుస్తూ చెత్త ఏరివేత కార్యక్రమాన్ని వార్డుల వారీగా చేపడుతున్నాం. ప్రజలను చైతన్యపర్చు తూ అవగాహన కల్పిస్తున్నాం. అలాగే స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తున్నాం. చెత్త ఏరివేత కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు, సిబ్బంది పాల్గొంటున్నారు. –సంపత్ కుమార్, కమిషనర్, పురపాలక సంఘం సిద్దిపేట

వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు

సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత

సిద్దిపేటకమాన్: ఆర్టీవో నిర్దేశించిన ప్రకారం నిబంధనలకు అనుగుణంగా వాహనాలకు నంబర్ ప్లేట్ ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల పట్టణాలు, ఇతర మండలాల్లో కొంతమంది వాహనదారులు వారి వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా, ఉన్నవాటిని మార్ఫింగ్ చేసి తిరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీంతో జిల్లాలో స్పెషల్ డ్రైవ్ ద్వారా శనివారం వాహనాల తనిఖీ నిర్వహించి నెంబర్ ప్లేట్ సరిగా లేని వాహనాలకు జరిమానాలు విధించడం, నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లను అమర్చే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు నంబర్ ప్లేట్ లేని 3,925 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్‌ఐ ఉమేష్, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు సుధాకర్‌రెడ్డి, హోంగార్డులు షాకీర్ పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్‌కు నంబర్ ప్లేట్ అందజేస్తున్న ట్రాఫిక్ ఏఎస్‌ఐ ఉమేష్, కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డి

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మహేందర్

అడిషనల్ డీసీపీ మహేందర్

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థి దశ నుంచే చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని అడిషనల్ డీసీపీ మహేందర్ పేర్కొన్నారు. శనివారం జగదేవ్‌పూర్‌లోని మహాత్మజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినిలకు మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్, తదితర అంశాలపై షీటీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా ఎక్కడి నుంచి అయినా షీటీమ్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేసి పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు. అలాగే ఎవరైనా వేధింపులకు గురి చేస్తే 100, 112, 1098కు కాల్ చేయాలని, 8712667343 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రమేష్, ఎస్‌ఐ కృష్ణమూర్తి, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది ఏఎస్‌ఐ అమృత్, సంజీవరెడ్డి, యుగందర్, జ్యోతి, అన్వేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్



పంట వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఏఓ శివప్రసాద్

సిద్దిపేటరూరల్: కొత్తగా రూపొందించిన అప్లికేషన్‌లో రైతులు పంట వివరాలను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ సూచించారు. శనివారం నారాయణరావుపేట మండలం లక్ష్మిదేవిపల్లిలో నిర్వహిస్తున్న పంటల వివరాల నమోదు తీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్, మొక్కలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నాగార్జున, సర్పంచ్, ఎంపీటీసీ, నోడల్ అధికారి ప్రకాష్ గౌడ్, పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

మర్కూక్(గజ్వేల్): రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని డీఏఓ శివప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామాల్లో వేదసాగు వరి పొలాలను, అధిక సాంద్రత పత్తి సాగును, ఆయిల్‌పామ్ పంటలను పరిశీలించారు. వానాకాలంలో వేదసాగు ద్వారా వరి పండిస్తే ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ నాగేందర్‌రెడ్డి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి సామూహిక తైలాభిషేకం



పూజలు చేస్తున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రంలో శనిత్రయోదశి మహోత్సవం వైభవంగా జరిగింది. శనివారం తెల్లవారు జామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో వేడుకలకు అంకురార్పణ చేశారు. శనీశ్వర పూజ కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు శనీశ్వరునికి సామూహిక తైలాభిషేకాలు జరిగాయి. అనంతరం కొండపైన అమ్మవారిని, ఉప ఆలయాల్లో దేవతామూర్తులను దర్శించుకున్నారు. క్షేత్రంలో మొత్తం 1250 తైలాభిషేకాలు జరిగాయని ఆలయ మేనేజర్ రఘుపవన్ తెలిపారు.

సిద్దిపేట ఏసీపీగా సురేందర్ రెడ్డి

సిద్దిపేట కమాన్: పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సిద్దిపేట ఏసీపీ, ట్రాఫిక్ ఏసీపీ అధికారులు బదిలీ అయ్యారు. సిద్దిపేట ఏసీపీగా కేతిరెడ్డి సురేందర్ రెడ్డి రానున్నారు. ప్రస్తుతం సిద్దిపేట ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న దేవారెడ్డిని హైదరాబాద్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్ స్థానంలో ప్రసన్న కుమార్‌ను నియమిస్తూ డీజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

రాష్ట్ర అభివృద్ధి దేశానికే ఆదర్శం

ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: సమైక్య పాలనలో రాష్ట్రం దుర్భిక్షంగా ఉండేదని, నేడు సీఎం కేసీఆర్ స్వపరిపాలనలో సుభిక్షంగా మారిందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట మంత్రి క్యాంప్ కార్యాలయంలో శనివారం మెదక్ నియోజకవర్గం రామాయంపేట, కోమటిపల్లి, సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండలం గిర్మాపూర్ గ్రామం నుంచి భారీగా బీఆర్‌ఎస్‌లోకి చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రామాయంపేట అభివృద్ధికి రూ.20కోట్లు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ పాల్గొన్నారు.

మంత్రి ప్రత్యేక పూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని పలు ఆలయాల్లో జరిగిన ఆషాఢ ఉత్సవాల్లో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. శనివారం దీకొండ మైసమ్మ ఆలయంలో, శ్రీ సత్యసాయిబాబా ఆలయ ఆవరణలో ఆషాఢ మాసం తొట్టెల ఊరేగింపు సందర్భంగా మంత్రి పూజలు చేశారు.



తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో మంత్రి

మంత్రిని కలిసిన సుజాత, సతీశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సుజాత, కుమారుడు సతీష్‌రెడ్డి శనివారం మంత్రి హరీశ్‌రావును సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రితో వారు తాజా రాజకీయ పరిస్థితులపై గంటకు పైగా చర్చించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.త్వరలోనే సీఎం కేసీఆర్‌ను కలువనున్నట్లు సమాచారం. కాగా ఎమ్మెల్యే రామలింగారెడ్డి అనారోగ్యంతో మరణించడంతో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన సతీమణి సుజాత బీజేపీ నుంచి పోటీ చేసిన రఘునందన్‌రావు చేతిలో 1100 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అయినప్పటికీ సుజాతతో పాటు సతీశ్‌రెడ్డి సైతం నియోజకవర్గంలో పర్యటిస్తూ బీఆర్‌ఎస్ క్యాడర్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో దుబ్బాక బీఆర్‌ఎస్ టికెట్ ఈసారి సతీశ్‌రెడ్డికి వస్తుందనే ప్రచారం కూడా జరుగుతుంది. ఈ క్రమంలో తల్లీకొడుకు మంత్రిని కలవడంపై నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.



హరీశ్‌రావుతో సుజాత, సతీశ్‌రెడ్డి

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి



రాజీవ్‌పార్కులో పనులను పరిశీలిస్తున్న ముత్యంరెడ్డి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని 'గడా' (గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి ఆదేశించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో అసంపూర్తిగా ఉన్న రాజీవ్‌పార్కు, డంపింగ్ యార్డు, ప్రజ్ఞాపూర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను సకాలంలో పూర్తి చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కమిషనర్ విద్యాధర్, ఏఈ కిష్టన్న, మేనేజర్ బాలక్రిష్ణ, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్లు పంబాల అర్చన శివకుమార్, వరలక్ష్మీ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్

కొండపాక(గజ్వేల్): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, మురికి కాలువల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవి రవీందర్, మడుపు భూంరెడ్డి, మహాదేవ్‌గౌడ్, బడేకోలు లావణ్య, నూనె కుమార్, దుర్గయ్య పాల్గొన్నారు.

పనిచేసేవారికి ప్రాధాన్యం

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోలు(దుబ్బాక): పార్టీ కోసం పనిచేసేవారికి తప్పకుండా గుర్తింపు, ప్రాధాన్యత లభిస్తుందని మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాయపోలు మండలం కొత్తపల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన 20మందికిపైగా కార్యకర్తలు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి ఎంపీ పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్



కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

హుస్నాబాద్: ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని, దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని సమయంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. ఉచిత విద్యుత్ విషయంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు చేసిన తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ శనివారం పట్టణంలోని కాంగ్రెస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే సతీశ్ కుమార్ గురువారం పట్టణంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఉరితీసి దహనం చేయడాన్ని నిరసిస్తూ కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉండి ప్రతిపక్షాలపై ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఓగులాపూర్ ప్రాజెక్టును పక్క నియోజకవర్గ ఎమ్మెల్యే తీసుకెళ్తుంటే స్థానిక ఎమ్మెల్యే ఏం చేశాడని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 75శాతం నిర్మాణం జరుపుకున్న గౌరవెల్లి ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బంక చందు, జంగపల్లి అయిలయ్య, మంద ధర్మయ్య, తిరుపతిరెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

వీడిన మహిళ మృతదేహం మిస్టరీ


మునావత్ బాషా (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): గుర్తుతెలియని మహిళ మృతదేహం ఆచూకీ కనుగొన్నారు. శనివారం జిన్నారం సీఐ వేణు కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 7న హత్నూర మండలం రొయ్య పల్లి శివారులో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభించిన విషయం తెలిసిందే. కేసు దర్యాప్తు కొనసాగించగా వారం రోజుల్లోనే పురోగతి సాధించారు. మృతురాలు మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఎల్లమ్మ గూడెం తండాకు చెందిన మునావత్ బాషా(25)గా గుర్తించామని, ఆమెకు భర్త లక్ష్మణ్, పసికందు ఉన్నట్లు గుర్తించామని సీఐ తెలిపారు. మృతురాలి చేతిపై ఉన్న లక్ష్మణ్ కిస్ మీ పచ్చ బొట్టు ఆధారంగా కేసు దర్యాప్తు నిర్వహించామన్నారు.త్వరలోనే పూర్తిస్థాయిలో కేసు ఛేదిస్తామని నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

దుకాణానికి వెళుతుండగా కుక్క దాడి

బాలుడికి గాయాలు


గాయపడిన సురేశ్

నర్సాపూర్: కిరాణా షాపునకు వెళుతుండగా బాలుడిపై శనివారం కుక్క దాడి చేసింది. ఈ ఘటనలో అతడికి స్వల్పగాయమైంది. పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న తన ఇంటి నుంచి కిరాణా షాపునకు సురేశ్ అనే బాలుడు వెళుతుండగా ఉదయం 9 గంటల సమయంలో కుక్క దాడి చేసింది. ఈ దాడిలో అతను పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరుకొని కుక్కను తరిమి రక్షించారు. అప్పటికే అతడి చేతికి గాయమైంది. వెంటనే క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ఇంజెక్షన్ వేశారు.

కంగ్టిలో 98.6 మిల్లీ మీటర్ల వర్షపాతం


కంగ్టిలో ఉధృతంగా ప్రవహిస్తున్న కాకివాగు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. నియోజకవర్గంలోని నల్లవాగు తర్వాత అతిపెద్ద చెరువు దామర్‌గిద్దా కాకివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతోంది. ముర్కుంజాల్ సాములవాగు ప్రాజెక్టు అలుగు పారడానికి ఒక్క అడుగు తక్కువగా ఉన్నట్లు రైతులు తెలిపారు. మూడు రోజులు వరుసగా 42.4మిల్లీ మీటర్లు, 37.8 మిల్లీమీటర్లు శుక్రవారం రాత్రి 98.6 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ఇసుకాసురుల భోజ్యం

- జనగామ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- అక్కన్నపేట మండలంలో ఇదీ పరిస్థితి


జనగామ వాగులో ఇసుక తోడేసిన దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. వాగులు, వంకల నుంచి పగలూరాత్రీ అనే తేడా లేకుండా జరుగుతున్న అక్రమ దందాను అడ్డుకునే వారే కరువయ్యారు. ఇసుక అక్రమ రవాణాతో ఓ వైపు ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.మరోవైపు సహజ వనరులు దెబ్బతింటున్నాయి.

- అక్కన్నపేట మండలం జనగామ వాగును అక్రమార్కులు తోడేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ రవాణా జోరుగా చేస్తున్నారు.
- ఈ వాగు నుంచి రోజు సుమారుగా 8 నుంచి 13 ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారంటే ఏ మేరకు రవాణా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.
- ఒక్కో ట్రాక్టర్ దూరాన్ని బట్టి రూ.3,800 నుంచి 4,500 వరకు విక్రయిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

- ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా రెవెన్యూ, పోలీస్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.
- అప్పుడప్పుడు తనిఖీలు చేస్తూ ట్రాక్టర్లకు నామమాత్రంగా జరిమానా విధించి వదిలేస్తున్నారు.
- దీంతో ఇసుక అక్రమ రవాణా చేసే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు

- వాగులు, ఒర్రెల నుంచి ఇసుక తరలించాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి. గృహ నిర్మాణానికి ఇసుక అవసరం ఉంటే ఇంజినీరింగ్ శాఖ నుంచి ధ్రువీకరణ పత్రం పొంది, తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది.
- రెవెన్యూ సిబ్బంది విచారణ జరిపి ఎంతమేరకు ఇసుక అవసరం ఉందో గుర్తించి అనుమతినిస్తారు.
- ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు స్థానిక వాగుల నుంచి ఇసుక తవ్వకునేందుకు కూడా అనుమతులు ఉండాల్సిందే.
- కానీ నిబంధనలు గాలికి వదిలేసి ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.


వాగులో ట్రాక్టర్ల చక్రాల గుర్తులు

అనుమతులు ఇవ్వలేదు



జనగామ వాగులో ఇసుక తోడేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. మండలంలో ఎవరికీ ఇసుక తరలింపు అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా ఎవరైనా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం. అభివృద్ధి పనులకు కూడా ఇసుక అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి.
- సంజీవ్‌కుమార్, తహసీల్దార్, అక్కన్నపేట

విద్యుదాఘాతానికి రైతు బలి


సంగయ్య మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతిచెందాడు. నిజాంపేట మండలం దామర్‌చెరువులో శనివారం ఈ ఘటన జరిగింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు.. గ్రామానికి చెందిన శికరి సంగయ్య(38) స్వంత పొలం పనులకు వెళ్లాడు. బోరు మోటార్ వద్ద విద్యుత్ సరఫరా జరగడం లేదని దగ్గరలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి మరమ్మతు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై రైతు సంగయ్య అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేయగా కల్హేర్ ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్రిమెంట్ చేయమంటే బెదిరిస్తున్నాడు..


బాధితుడు ఎండీ సాజిద్

బెజ్జంకి(సిద్దిపేట): ఒకేషనల్ కళాశాల నిర్వహణ కోసం భవనం అద్దెకిస్తానని మోసం చేసిన యజమానిపై కేసు నమోదైంది. ఈ ఘటన బెజ్జంకిలో శనివారం జరిగింది. బాధితుడు ఎండీ సాజిద్ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్‌కు చెందిన సాజిద్ బెజ్జంకిలో ఒకేషనల్(వృత్తివిద్య) కళాశాల పెట్టాలనుకున్నాడు. దాచారానికి చెందిన బుచ్చయ్యకు బెజ్జంకిలో గల భవనాన్ని మార్చిలో అద్దెకు తీసుకున్నాడు. రూ. 2 లక్షల డిపాజిట్‌తోపాటు నెలకు రూ. 38 వేల అద్దె ఒప్పందం చేసుకున్నాడు. డిపాజిట్ కింద రూ. 50 వేలు చెల్లించి, మిగితావి విడతలవారీగా ఇచ్చేలా మాట్లాడుకున్నారు. అనంతరం తన కళాశాల నిర్వహణ పనులు చేసుకొని ఫర్నిచర్ తెచ్చుకున్నాడు. అద్దెకు తీసుకున్న భవనానికి అగ్రిమెంట్ చేయకపోవడంతో తన కళాశాల అనుమతులు నిలిచిపోయాయి. అగ్రిమెంట్ చేయమంటే యజమాని బెదిరిస్తున్నాడని బాధితుడు ఎండీ సాజిద్ శనివారం బెజ్జంకి స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు 420 సెక్షన్ కింద కేసు నమోదు కాగా, ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్‌రాజ్ దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ మోసగాళ్ల బురిడీ

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు చేసిన ఫోన్ కాల్స్‌కు స్పందించి పలువురు బాధితులు శనివారం ఆన్‌లైన్ సైబర్ మోసానికి గురయ్యారు. సీపీ కథనం ప్రకారం..

- సిద్దిపేట త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ప్రైవేటు ఉద్యోగాలు ఉన్నాయని తన ఫోన్‌కు వచ్చిన మెసేజ్ చూసి స్పందించి, ఆ నంబర్‌కు ఫోన్ చేశాడు. ఉద్యోగం కోసం ముందుగా ప్రాసిసెంగ్ చార్జీలు చెల్లించాలని తెలపగా బాధితుడు రూ.వెయ్యి చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తర్వాత ఖర్చుల కోసం డబ్బులు పంపాలని తెలపగా బాధితుడు, గుర్తు తెలియని వ్యక్తికి రూ.29,598 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించాడు.
- ఇదే తరహాలో గజ్వేల్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి, గుర్తు తెలియని మరో వ్యక్తికి రూ. 13వేలు పంపించి మోసపోయాడు.
- వన్ టౌన్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్ ఆఫ్ బరోడా క్రెడిట్ కార్డు మంజూరు చేస్తామని, వ్యక్తిగత వివరాలతోపాటు గతంలో ఉన్న క్రెడిట్ కార్డు వివరాలు తెలపాలని సూచించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు తన వద్ద ఉన్న కార్డు వివరాలు తెలిపాడు. అతడి ఖాతా నుంచి రూ. 9,904 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది.
- రూరల్ స్టేషన్ పరిధిలోని ఓ మహిళ ఇన్‌స్ట్రాగామ్‌లో మూవీ యాక్టింగ్ అవకాశం ఉందనే యాడ్ చూసి అందులోని నంబర్‌కు ఫోన్ చేసింది. హీరోయిన్‌గా అవకాశం కల్పిస్తానని డబ్బులు చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తి తెలిపిన మాటలు నమ్మి ఆన్‌లైన్‌లో రూ.16,000 పంపించింది. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది.
- పట్టణంలోని ఓ చికెన్ షాప్ నిర్వాహకుడికి జగదేవ్‌పూర్ ఫామ్ హౌస్ నుంచి మాట్లాడుతున్నామని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. 15 కేజీల చికెన్ ఆర్డర్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి చికెన్ షాప్ నిర్వాహకుడికి రూ.5 ఆన్‌లైన్‌లో పంపించాడు. మిగతా డబ్బులు పంపిస్తానని తాను పంపిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలని సూచించాడు. ఆ మాటలు నమ్మిన చికెన్ షాప్ నిర్వాహకుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగా తన ఖాతా నుంచి రూ.9,489 డెబిటైనట్లు మెసేజ్ వచ్చింది. జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930లో బాధితులు ఫిర్యాదు చేశారు.

ఫొటో మార్ఫింగ్ చేసి యువతికి బెదిరింపులు

- పోలీసుల అదుపులో నిందితుడు
- రిమాండ్‌కు తరలింపు

దౌండపర్తి: ఓ సామాజిక మాధ్యమంలో ఫొటో న్యూడ్‌గా మార్ఫింగ్ చేసి యువతిని బ్లాక్‌మెయిల్ చేసిన యువకుడిని సైబర్ క్రైం పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. పోలీసుల కథనం ప్రకారం.. దౌండపర్తిలోని హెచ్‌బీ కాలనీకి చెందిన యువతి ఫొటో న్యూడ్‌గా మార్ఫింగ్ చేసి దానిని ఇంటర్నెట్‌లో పెడతానని ఆమెను ఓ వ్యక్తి బెదిరించాడు. అలాగే తన ఫ్యామిలీ మెంబర్స్ అందరి ఫొటోలు ఇదే మాదిరిగా మార్ఫింగ్ చేస్తానన్నాడు. దీంతో షాక్‌కు గురైన యువతి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం సి.భవానిప్రసాద్ సాంకేతికతతో ఆ మార్ఫింగ్ ఫొటో పంపించింది తెలంగాణలోని సిద్దిపేటకు చెందిన మన్నే మధు(18)గా గుర్తించారు. దీంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ ఆదేశాలతో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు సూచనలతో ఒక బృందాన్ని సిద్దిపేటకు పంపించారు. అక్కడ మధును చాకచక్యంగా పట్టుకొని విశాఖకు తీసుకువచ్చి అరెస్టు చూపించారు. శనివారం కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

సిద్దిపేటరూరల్: పాము కాటుకు గురై చికిత్సపొందుతున్న వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం రూరల్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తోర్నాల గ్రామానికి చెందిన వాసూరి నారాయణ(55) ఈనెల 7న పంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో పొలం వద్దకు వెళ్లిన నారాయణ ఇంటికి తిరిగొచ్చి తనకు పాము కాటు వేసిన విషయాన్ని కుటుంబీకులకు చెప్పి కిందపడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు నారాయణను హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి కుటుంబీకులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. అప్పటి నుంచి చికిత్సపొందుతున్న నారాయణ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తీసుకోని రుణానికి వేధింపులు

పటాన్‌చెరు టౌన్: లోన్ తీసుకున్నావ్ తీర్చాలంటూ సైబర్ నేరస్తుడు వేధింపులకు గురిచేసిన ఘటన పటాన్‌చెరు స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన సత్యనారాయణ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. ఈనెల 4న తన ఫోన్‌కు ఓ మెసేజ్ వచ్చింది. అది చూసి సత్యనారాయణ కాల్ చేసి మాట్లాడగా, నీవు రుణం తీసుకున్నావు వెంటనే నగదు చెల్లించాలని సైబర్ మోసగాడు చెప్పాడు. వెంటనే చార్జీలు కింద రూ.200 జమ చేయాలని చెప్పడంతో కంగారుపడిన సత్యనారాయణ జమ చేశాడు. అనంతరం ఎక్కడా తాను రుణం తీసుకోలేదని ధ్రువీకరించుకున్నాక, తర్వాత అవతల నుంచి ఫోన్ చేసినా సత్యనారాయణ స్పందించలేదు. దీంతో బాధితుడి తల్లి, చెల్లిని ప్రస్తావిస్తూ అసభ్యకర మెసేజ్‌లు పెడతామని శనివారం ఉదయం నుంచి సైబర్ మోసగాడు వేధించాడు. హుటాహుటిన పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డబ్బులు చెల్లించకపోవటంతో..


జేసీబీతో ఇళ్లను కూల్చివేయిస్తున్న అధికారులు

- ఇళ్లు కూల్చివేసిన అధికారులు
- ఆందోళన చేపట్టిన బీజేపీ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): 59 జీఓ కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నా, డబ్బులు చెల్లించకపోవటంతో రెవెన్యూ అధికారులు ఇళ్ల కూల్చివేసేందుకు రంగం సిద్ధం చేశారు. శనివారం తహసీల్దార్ దశరథ్‌సింగ్ రాథోడ్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది డబ్బులు చెల్లించని వారి ఇళ్లను కూల్చివేయించేలా చర్యలు చేపట్టారు. పోలీసుల సమక్షంలో జేసీబీతో ఇళ్లను కూల్చివేయించారు. బీజేపీ నాయకుడు ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం సరైంది కాదని ఆందోళన చేపట్టారు. నిరుపేద వ్యక్తి క్రమద్ధీకరణకు లక్షల్లో డబ్బులు చెల్లించటం ఏమిటని నాయకులు అధికారులను, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిరుపేదలకు అండగా ఉంటామని, మరోసారి ఇళ్లను కూల్చివేసే చర్యలకు పాల్పడితే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ బొల్లారంలో 51 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు డబ్బులు చెల్లించి రెగ్యులరైజ్ చేయించుకోవాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్ మందాని

నారాయణఖేడ్: చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని నారాయణఖేడ్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మందాని అన్నారు. నారాయణఖేడ్ కోర్టు ఆవరణలో శనివారం మండల లీగల్‌సెల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. పౌరులకు చట్టాలపై సమగ్ర అవగాహన ఉంటే శిక్షపడుతుందనే భయంతో నేరాలు తగ్గుతాయన్నారు. ఉచిత న్యాయ సహాయ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. న్యాయవాదులు భోజిరెడ్డి, సుధాకర్, లీగల్ సర్వీస్ సంస్థ సభ్యులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

వట్‌పల్లి(అందోల్): నేటి సమాజంలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని జోగిపేట మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ ధనలక్ష్మి అన్నారు. శనివారం జోగిపేటలోని బాలికల వసతి గృహంలో విద్యార్థులకు మండల న్యాయ సేవాధికార ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నీట మునిగి విద్యార్థి..


అబ్దుల్ హసీబ్(ఫైల్)

ములుగు(గజ్వేల్) : కొండ పోచమ్మ సాగర్‌లో ప్రమాదవశాత్తు మునిగి విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం ములుగు మండలం కొండపోచమ్మ సాగర్ వద్ద చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ అంజయ్య కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని న్యూ ఆఫీస్ పెట్ మియాపూర్ శేరిలింగంపల్లి ఆదిత్యనగర్ కాలనీకి చెందిన ఎండీ అబ్దుల్ హసీబ్(20) డిగ్రీ చదువుతుండేవాడు. శుక్రవారం సాయంత్రం మిత్రులతో కలిసి సాగర్ చూసేందుకొచ్చాడు. డ్యాంలో దిగి స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. పోలీసులు శనివారం ఉదయం గాలించి అబ్దుల్ హసీబ్ మృతదేహాన్ని సాగర్‌లోంచి స్వాధీనం చేసుకున్నారు. మృతుడి తండ్రి అలీ కామిల్ పాషా ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భూతగాదాలో ఇద్దరికి గాయాలు

కొమురవెల్లి(సిద్దిపేట): భూతగాదాలో ఇద్దరికి గాయాలయ్యాయి. శనివారం మండలంలోని రాంసాగర్ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సర్వే నంబర్ 72లోని భూమి విషయంలో కొంతమంది మధ్య వివాదం కొనసాగుతోంది. శనివారం పాకనాటి సుధాకర్, పరుశురాములు భూమిని ట్రాక్టర్‌తో దున్నుతుండగా పాకనాటి బాల్‌నర్సయ్య, పాకనాటి భాస్కర్ అడ్డుకున్నారు. దీంతో పాకనాటి సుధాకర్, పరుశురాములు గడ్డపారతో దాడిచేయగా బాల్‌నర్సయ్య కు, భాస్కర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంమూర్తి తెలిపారు.

ఆయిల్‌పామ్‌పై రైతులను జాగృతం చేయాలి

లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో సాగు ఉండాలి

- శాఖల సమన్వయం అవసరం
- మొక్కల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: రైతులకు మిక్కిలి ఆదాయాన్ని అందించే ఆయిల్ పాం పంటపై రైతులను మరింతగా చైతన్యం చేయాలని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయిల్ పాం సాగుపై కలెక్టర్, వ్యవసాయ, ఉద్యానవన, ఆయిల్ ఫెడ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానవన, ఆయిల్ ఫెడ్ శాఖల మధ్య సమన్వయం లేదన్నారు. అందుకే జిల్లాలో ఆయిల్ ఫాం ముందుకు సాగడం లేదన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, ఆయిల్ ఫెడ్ జాయింట్ పర్యవేక్షణ చేస్తే అనుకున్న సత్ఫలితాలు వస్తాయని ఆయా జిల్లా శాఖ అధికారులను మంత్రి హరీశ్ రావు సుతిమెత్తగా మందలించారు. లక్ష్యాలకనుగుణంగా జిల్లాలో ఆయిల్ పాం సాగు ఉండాలని, ఆ దిశగా క్షేత్రస్థాయిలో రైతులను చైతన్యం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మొక్కల సంరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్మీ కంపోస్టు సిద్దిపేట మున్సిపాలిటీలో చాలా ఉందని, మున్సిపాలిటీ వర్మీ కంపోస్టు.. తన ఫామ్ హౌసులోని మొక్కలకు వాడుతున్నానని చాలా బాగుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 2 లక్షలా 50 వేల వరి నార్లు సిద్ధం చేశారని, 17 వేల వరి నాట్లు పడ్డాయని సమీక్షలో వ్యవసాయాధికారులు వివరించారు.

ఐదుగురి బలవన్మరణాలు

వేర్వేరు చోట్ల ఐదుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. కుకునూరుపల్లి, పాపన్నపేట, తెల్లాపూర్, సిద్దిపేట అర్బన్, జహీరాబాద్ పట్టణంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి.పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం..

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం


మహిపాల్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక వార్డు సభ్యుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. ఈ సంఘటన మండల కేంద్రమైన కుకునూరుపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుకునూరుపల్లికి చెందిన 8వ వార్డు సభ్యుడు కొంతం మహిపాల్(32), కుటుంబ పోషణ కోసం ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ సొంతంగా ఉన్న ట్రాక్టరు నడుపుతుండేవాడు. వ్యవసాయం, కుటుంబ పోషణ కోసం తెలిసిన వారి వద్ద రూ.8లక్షలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చడం కోసం ట్రాక్టర్ విక్రయించినా తీరకపోవడంతో లోలోన మదన పడుతుండేవాడు. శుక్రవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి వేర్వేరు గదుల్లో నిద్రించారు. శనివారం ఉదయం గది నుంచి బయటకు రాకపోవడంతో భార్య లావణ్య తలుపు తట్టగా తీయకపోవడంతో పక్కంటి యజమాని కొంతం బాల్‌లింగం తలుపులు పగలగొట్టి చూస్తే ఉరేసుకొని మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ పొల్కంపల్లి జయంతి, ఉప సర్పంచ్ బాలాగౌడ్‌తో పాటు మిగతా వార్డు సభ్యులు మృతదేహం వద్ద సంతాపం తెలిపారు.

పని వెతుక్కోమన్నందుకు ఆత్మహత్య


సురేశ్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని టేక్మాల్ మండలం బోడగట్టులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బోడగట్టు గ్రామానికి చెందిన సురేశ్(27) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్ని రోజులుగా సురేశ్ ఏ పనీ చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఏదైనా పని చేయమని పలుమార్లు అతడి భార్య భాగ్యలక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన సురేశ్ రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు రాత్రి అతడి ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోయింది. గ్రామ శివారులోని కొచ్చెరువు కట్టపై ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం మృతదేహం చూసిన కొందరు ఈ విషయమై గ్రామస్తులకు సమాచారం అందజేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో మరొకరు..

రామచంద్రాపురం (పటాన్‌చెరు) : ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొల్లూర్ స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన బిశ్వరంజన్(40) జీవనోపాధి కోసం తెల్లాపూర్‌కు వలసొచ్చాడు. స్థానికంగా ఓ బహుళ అంతస్తుల భవనం నిర్మాణంలో కూలీగా పనిచేసుకునేవాడు. తోటి కూలీలతో కలిసి లేబర్‌క్యాంప్‌లో ఉండేవాడు. కాగా శుక్రవారం తోటి కూలీలు పనికి రమ్మని బిశ్వరంజన్ పిలిచారు. తను పనికిరానని వారికి చెప్పడంతో వెళ్లిపోయారు. తిరిగి రాత్రికి వచ్చి చూసేసరికి గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే పోలీసులకు, ఒడిశాలోని మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పితో ఇంకొకరు..

సిద్దిపేటఅర్బన్: కడుపునొప్పితో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్‌లోని ఒడిసెలకుంట వద్ద చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసులు కథనం ప్రకారం.. సిద్దిపేట హౌసింగ్ బోర్డు కాలనీ అరుంధతి నగర్‌వాసి బండపల్లి శివకుమార్ (28) ఓ కూలీ. అతడు రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు.చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో మనస్తాపం చెందుతున్నాడు.శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా లభించలేదు.కిష్ట సాగర్ సమీపంలోని ఒడిసెలకుంట చెరువు వద్ద గుర్తుతెలియని వ్యక్తి చనిపోయినట్టు మృతుడి తండ్రి తెలుసుకున్నాడు. అక్కడికి వెళ్లి చూడగా కుమారుడు చెరువులో విగత జీవిగా కనిపించాడు. మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో..

జహీరాబాద్ టౌన్: కుటుంబ కలహాల కారణంగా శనివారం రాత్రి పట్టణంలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన కామేశ్(25) కుటుంబకలహాలతో మనస్తాపంచెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.